పగలు భగభగ.. రాత్రి గజగజ


మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన పాలసముద్రం ప్రధాన రహదారి


ఉదయం మంచులో చలిమంట వేసుకున్న వృద్ధులు

- వాతావరణంలో భిన్న మార్పులు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- రాత్రి పూట తగ్గని చలి

పాలసముద్రం: గత కొద్ది రోజులుగా వాతావరణంలో తీవ్ర మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పగలు ఎండలు మండిపోతున్నాయి.. రాత్రి సమయాల్లో చలి వణికించేస్తోంది. ప్రస్తుతం నెలకొన్న ఈ భిన్న వాతావరణంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా శివరాత్రి వస్తే శివ శివా అంటూ చలి పోతుందని చెబుతుంటారు. అయితే గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది మార్చి మొదటి వారం నుంచే ఎండ తీవ్రత అధికమవుతోంది. మరోవైపు గత కొద్ది రోజులుగా రాత్రి సమయాల్లో మంచు కురుస్తుండడంతో చలి గాలులు మరింత పెరుగుతున్నాయి. తెల్లవారుజామున మంచు కురుస్తోంది.

పగలు ఎండవేడిమితో భగభగలు

గత వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. గరిష్ఠంగా 32 నుంచి 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. అయితే రాత్రి సమయాల్లో మాత్రం ఉష్ణోగ్రతలు అమాంతం పడిపోతున్నాయి. వారం రోజుల నుంచి తెల్లవారుజామున ప్రాంతంలో 19 నుంచి 23 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా మధ్యాహ్నం 30 నుంచి 35 డిగ్రీల పైగా నమోదవుతున్నాయి.


పుచ్చకాయలను ముక్కలుగా కోసి కొనుగోలుదారులకు విక్రయిస్తున్న వ్యాపారి

శీతల పానీయాలు, పుచ్చకాయల వ్యాపారం జోరు

భానుడి భగభగలకు అప్పుడే ప్రజలు శీతల పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. షరబత్, బత్తాయి, చెరకు రసాలతో తోపుడు బండ్లు రోడ్లపైకి వచ్చేస్తున్నాయి. జాతీయ రహదారి పక్కన కొబ్బరి బోండాలు అమ్ముడుపోతున్నాయి. గ్రామాల్లో గిరాకీ బాగుంటుందని ఐస్‌క్రీం విక్రయిస్తున్నారు. వీటితో పాటు పుచ్చకాయల వ్యాపారం జోరుగా సాగుతోంది.

ఎండ వేడి అధికంగా ఉంది



గతంలో ఇలాంటి ఎండ వేడిమి కనిపించేది కాదు. రైతులు పొలాల్లో పని చేసినా శ్రమ అనిపించేది కాదు. రాత్రి వేళల్లో కొంత మేరకు చలి అధికంగా ఉంటుంది. అయితే పగటి వేళల్లో మాత్రం ఎండ అధికంగా ఉంటూ ఉక్కపోతగా ఉంది. ఉన్నట్లుండి వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ఎండల తీవ్రత ఎక్కువైపోతోంది.

–వి.ఆరుల్‌దాస్, ఎస్‌కేఆర్ పురం

ఓఆర్‌ఎస్ తీసుకోవాలి



ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువైపోతున్నది. అందువలన ఆశా కార్యకర్తలు గ్రామాల్లోని ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించాలి. ఓఆర్‌ఎస్ ద్రావణం అందుబాటులో ఉంచాలి. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో గర్భిణులు బయటికి రావాలంటే గొడుగు సహాయం తీసుకోవాలి. మజ్జిగ, పండ్ల రసం ఎక్కువగా తీసుకోవాలి.

–మోహన్‌క్రిష్ణ, వైద్యాధికారి

జాగ్రత్తలు తీసుకోవాలి



మార్చి తొలి వారం నుంచి పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఇప్పటి నుంచి ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు చేపట్టాలి. రానున్న వేసవిలో ఎండలు మరింత పెరుగుతాయి. ఎలాంటి అనారోగ్య పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ దిశగా వైద్య ఆరోగ్యశాఖ ప్రజలకు అవగాహన కల్పించాలి.

–సీ.హనుమంతరావు, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్

క్లుప్తంగా

మెట్ట పంటలకు సస్యరక్షణ చర్యలు

నిండ్ర: మండలంలోని రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన మెట్ట (ఉద్దులు, పెసర, వేరుశనగ) పంటలకు సస్యరక్షణ చేపట్టాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం సూచించారు. ఆయన సోమవారం నిండ్ర, అగరం గ్రామాల్లో మినుములు, పెసర పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ పంటలో చీడలు పెరుగుతాయని గుర్తించి రైతులు సస్యరక్షణ చేపట్టాలని అన్నారు. ఆకులు రంగు మారడం వంటివి గుర్తించి వాటి నివారణ చేపట్టాలని అన్నారు. ఎకరాకు క్లోరిపైరిపాస్ 500 మిల్లీ, మెంగోజెబ్ 200 గ్రాములు కలిపి పిచికారీ చేయడం వలన చీడలను నివారించవచ్చని రైతులకు తెలిపారు.

లక్ష్మీ నరసింహ స్వామికి పట్టువస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలు తీసుకువస్తున్న కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: మండలంలోని మంగుంటలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం గంగాధరనెల్లూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వేద పండితులు ఆమెకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి, ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం స్వామివారిని ఊరేగించారు. ఈ కార్యక్రమానికి మండల కన్వీనర్ మణి, సర్పంచ్ రూపా, ఎంపీపీ సరిత జనార్దన్, జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి విజయాబాబు, కుప్పయ్య, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు దిలీప్‌రెడ్డి, యూత్ కార్యదర్శి శ్యామ్‌రాజ్‌తోపాటు నాయకులు ఉమాపతి, కోటిరెడ్డిబాబు, గోవింద స్వామి, సుధ, మణి, ఏకాంబరం, మహేష్, దొరస్వామి, అమృతరాజ్, బాబు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ


ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీవో

నిండ్ర: మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం నగరి డీఎల్‌డీవో ఖాదర్‌బాషా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. రోగుల వివరాలు, మందుల పంపిణీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని పలు సచివాలయాలను తనిఖీలు చేశారు. నిండ్ర బీసీ హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి అక్కడి వసతులపై ఆరా తీశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో పలు అంశాలపై చర్చించి, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్ వర్మ పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సత్కారం


సత్కారం పొందిన మహిళా ఉపాధ్యాయులు

నగరి: మండలంలోని ముడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను పాఠశాల ఉపాధ్యాయులు దుశ్శాలువలతో సత్కరించారు. పాఠశాలలో సోమవారం వారు మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాస్టల్ వంట మనిషి మృతి

గంగాధర నెల్లూరు: స్థానిక బాలుర సంక్షేమ వసతి గృహంలో వంట మనిషి(కుక్)గా పనిచేస్తున్న నందకుమార్(45) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. హాస్టల్‌లో రెగ్యులర్‌గా పనిచేస్తున్న ఇతను గుండెల్లో నొప్పిగా ఉందని కుటుంబసభ్యులకు చెప్పారు. ఆ తరువాత కొద్దిసేపటికే మరణించారు. సమాచారం తెలుసుకున్న ఏఎస్ డబ్ల్యూఓ షకీలా మృతుని ఇంటికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం



విజయపురం: మండలంలోని శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకమరాజు విజయచంద్రిక, సునీత, రాధాకుమారి, వెంకటేశు, గోపి, విజయకుమార్, విజయవర్మ, లక్ష్మీపతి పాల్గొన్నారు.

జెడ్పీటీసీకి కృపాలక్ష్మి పరామర్శ



శ్రీరంగరాజపురం: ఇటీవల అనారోగ్యానికి గురైన జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్‌రెడ్డిని మంగుంటలోని వారి స్వగృహానికి సోమవారం వెళ్లిన గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఆయన్ను పరామర్శించారు. ఆమెతోపాటు మండల కన్వీనర్ మణి, ఎంపీపీ సరిత జనార్దన్, సర్పంచ్ రూపా, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు దిలీప్ రెడ్డి, జిల్లా క్రియాశీలక కార్యదర్శి విజయాబాబు, కుప్పయ్య, నాయకులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ఇంజిన్ వితరణ


ఇంజిన్‌ను అందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

పుత్తూరు: స్థానిక పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు శ్రీసిటీ శంకర్ మోటార్స్ ప్రైవేట్ కంపెనీ వారు ఇంజిన్‌ను వితరణగా అందజేశారు. ఇసుజు మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ శంకర్ శ్రీనివాస్ బృందం ఆధ్వర్యంలో సోమవారం ఇంజిన్ అందజేశారు. వారు మాట్లాడుతూ ఇసుజు మోటర్స్‌ను 1916లో ప్రారంభించారని చెప్పారు. 109 ఏళ్ల సుదీర్ఘ అనుభవం కలిగిన సంస్థ అని తెలిపారు. పూర్తి స్థాయి వాహనాలతో పాటు విడి భాగాలను సైతం తయారుచేసి విదేశాలకు ఎగుమతులు చేస్తున్నట్లు వివరించారు. తాము అందించిన ఇంజిన్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు 16 పాలిటెక్నిక్ కళాశాలలకు ఇంజిన్లను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్, ఇసుజు మోటార్స్ ప్రతినిధులు ప్రదీప్, మురళి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం


సారా స్థావరాలపై దాడులు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కార్వేటినగరం: వెదురుకుప్పం మండంలో విస్తృత దాడులు చేసి, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వైవీ పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వెదురుకుప్పం మండలం గెరిగదొన గ్రామం అటవీ ప్రాంతంలో జోరుగా సారా తయారీ జరుగుతున్నట్లు అందిన రహస్య సమాచార మేరకు దాడులు చేశారు. అక్కడ సారా తయారీకి సిద్ధం చేసి ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. అలాగే అమ్మకానికి సిద్ధంగా ఉన్న 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన గోపిపై కేసు నమోదు చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ తెలిపారు. ఈ దాడుల్లో దేవప్రసాద్, ఢిల్లీబాబు, రాజేష్, తంబీష్, దీప, కృష్ణవేణి పాల్గొన్నారు.

బెల్టుషాపుపై దాడులు

శ్రీరంగరాజపురం: బెల్టుషాపుపై పోలీసులు దాడులు చేశారు. ఎస్ఐ సుమన్ కథనం మేరకు..ఎన్ఆర్ పురం గ్రామానికి చెందిన మోహన్ బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీనిపై స్పందించిన ఎస్ఐ తన సిబ్బందితో ఆ గ్రామంలో దాడులు చేశారు. గ్రామానికి చెందిన మోహన్ ఇంట్లో బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు గుర్తించి, అక్కడ ఉన్న 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మోహన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. అలాగే పుల్లూరుక్రాస్ పరిధిలో పేకాట స్థావరాలపై దాడులు చేసి ఆరుగురిని అరెస్టు చేసి, రూ.5740 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అరాచక పాలనపై కాంగ్రెస్ నిరసన



ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ చింతామోహన్

గంగాధరనెల్లూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అరాచక పాలన చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ చింతా మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని సోమవారం ఎంపీడీవో కార్యాలయం ముందు మాజీ ఎంపీ చింతా మోహన్ ధర్నా చేశారు. మాజీ ఎంపీ మాట్లాడుతూ ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను వెంటనే ప్రారంభించాలంటూ నినాదాలు చేశారు. దేశంలో పెరిగి పోతున్న పేదరికాన్ని ప్రధాని పట్టించుకోక పోవడం దారుణమని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి మాటలకే పరిమితమైపోయిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన ఒక్కహామీ నెరవేర్చపోవడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పలువురు పాల్గొన్నారు.

ప్రజా వినతుల పరిష్కారంపై దృష్టి పెట్టండి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్

శ్రీరంగరాజపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని తహసీల్దార్ లోకనాథ పిళ్లై ఆదేశించారు. ఆయన సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 12 వినతులు వచ్చాయి. అందులో ముటేషన్ 04, శ్మశానానికి దారి 02, భూసర్వే 02, ఇంటి నిర్మాణానికి పొజిషన్ పట్టా మంజూరు చేయాలని 01, పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని 02, ఇతరుల ఆక్రమణలో భూమిని తొలగించి హద్దులను చూపించాలని 01, వంటి వినతులు వచ్చాయని అన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరు జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. దీనికి రెవెన్యూ సిబ్బంది, అర్జీదారులు పలువురు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు చేసి తాగునీరు అందించండి


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

కార్వేటినగరం: బోరు ఏర్పాటు చేసి గ్రామానికి తాగునీరు అందించాలని సోమవారం ఆర్కేవీబీపేట గ్రామ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మహిళలు మాట్లాడుతూ ఆర్కేవీబీపేట చిన్నవీధిలో 70 కుటుంబాలు ఉన్నాయని వారికి కుళాయి నీళ్లు చాలక పోవడంతో తాగునీటి సమస్య నెలకొందని ఆరోపించారు. అధికారులు సమన్వయంతో పని చేయక పోవడంతో గ్రామంలో నీటి సమస్య నెలకొందని తెలిపారు. కనీసం బోరు ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని కోరారు. లేకుంటే కలెక్టర్ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

అంగన్‌వాడీల అక్రమ అరెస్టుపై నిరసన


ఏవోకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు


కార్వేటినగరం: ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

నగరి: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో నిర్వహించే ధర్నాకు వెళ్లే వారిని అక్రమంగా అరెస్టు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య అన్నారు. అరెస్టులను నిరసిస్తూ నగరి అంగన్‌వాడీ ప్రాజెక్ట్ అంగన్‌వడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులతో కలిసి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి ఏవోకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలకు జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి నాయకులు ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. దీన్ని నిరసిస్తూ శాంతియుతంగా ఆవేదనను ప్రభుత్వానికి తెలియపరచడానికి చలో విజయవాడ కార్యక్రమానికి ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాలు సంయుక్తంగా పిలుపునిచ్చాయన్నారు. సమస్యలు పరిష్కరించక పోగా బలవంతంగా అరెస్టు చేయడం అన్యాయమని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నగరి ప్రాజెక్టు అధ్యక్షురాలు బుజ్జమ్మ, కోశాధికారి శాంతి, నాయకులు ధనలక్ష్మి, లక్ష్మి, దేవిక, నీరజ, శకుంతల, గీత, చంద్ర కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల అరెస్టు తగదు

కార్వేటినగరం: శ్రమకు తగ్గ వేతనం పెంచాలని డిమాండ్ చేయడానికి బయలుదేరిన అంగన్‌వాడీ కార్యకర్తలను అరెస్టు చేసి నిర్బంధించడం ప్రభుత్వానికి తగదని కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు విజమ్మ అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లను పరిష్కరించాలని సోమవారం ఐసీడీఎస్ నుంచి మండల కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు మహాధర్నా ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు చెంచులక్ష్మి, రెడ్డెమ్మ, దేశమ్మ, హైమ, లక్ష్మీనరసమ్మ, పద్మ, ఉమ రాణి, సుగుణ, నాగమ్మ పలువురు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేసుకోవాలి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం: మండల పరిధిలోని గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెలా వైద్య పరీక్షలు చేసుకోవాలని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారంతో పాటు మజ్జిగ, పండ్ల రసం, ఆకుకూరలు, ఎక్కువగా నీరు తీసుకోవాలని చెప్పారు. అనంతరం 52 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, మురళి పాల్గొన్నారు.

నేడు మామిడి రైతులకు శిక్షణ

పుత్తూరు: ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం స్థానిక మార్కెట్ యార్డ్‌లో మామిడి రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పుత్తూరు హార్టికల్చర్ ఆఫీసర్ వెంకట సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్తలు తగిన సూచనలు ఇస్తారని తెలిపారు. వడమాలపేట, నారాయణవనం, పుత్తూరు మండలాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

IN THE COURT OF THE V ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) OF CHITTOOR
I.A.No.462 of 2024
O.S.No.626 of 2024

Between:
P. Neeraja .....Plaintiff
And:
K.Hariprasad Reddy and others ... Defendants

SUIT SUMMONS/NOTICE TO THERESPONDENTS/ DEFENDANTS No. 1,3,5&6

To,
1.K.Hariprasad Reddy, S/o K.Narayana Reddy, aged about 45 years, Hindu,driver,
3. K.Harshavardhan Reddy, S/o K.Hari Prasad Reddy, aged about 19 years, Hindu,
5.K.Rambabu, S/o K.Naryana Reddy, aged about 38 years, Hindu, Driver,
6. K.Deepa, W/o K.Rambabu, aged about 35 years,Hindu, cultivation,
The Respondents/defendants No. 1, 3, 5 and 6 are residing at Pedda kuntapalli Village, Nandhanoor Post, G.D.Nellore Mandal,Chittoor District.

The above suit has been filed by the plaintiff for permanent injunction and the filed I.A.No. 462 of 2024 for temporary injunction from restraining defendants/respondents, their men, agents, servants or their assignees, from interfering with the peaceful possession and enjoyment of the plaint/ petition schedule mentioned properties and the above case is posted for dt. 11.04.2025 and that you are hereby requested to appear before the above said Hon'ble Court either in person or through advocate at about 10.30 AM on 11.04.2025 for your appearance. Failing which the case will be decided by setting you as expartee.

V.JAYA KUMAR
Advocate,Chittoor

విద్యార్థులకు అండగా యువత పోరు

నగరి: విద్యార్థులకు అండగా నిలబడి యువత పోరు చేద్దామని మాజీ మంత్రి ఆర్కేరోజా సోదరుడు కుమారస్వామి రెడ్డి అన్నారు. మాజీ మంత్రి నివాస కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం ఆయన యువతపోరు పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాలను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వంపై నిరసన తెలిపేందుకు వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చిందన్నారు. ఈ మేరకు ఈ నెల 12న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని యువత పోరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. స్థానికంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించిన అనంతరం తిరుపతిలో యువత పోరు కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు పీజీ నీలమేఘం, హరి, వైస్ చైర్మన్లు జయప్రకాష్, బాలన్, ఎంపీపీలు భార్గవి, మునివేలు, మండల పార్టీల అధ్య క్షులు, బీసీ, ఎస్సీ అనుబంధ కమిటీల రాష్ట్ర, జిల్లా అధ్య క్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ మోసగాడు చంద్రబాబు

కార్వేటినగరం: అధికారం కోసం చంద్రబాబు సూపర్ సిక్స్ హామీల పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేసి గద్దెనెక్కారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. పుత్తూరులోని ఆమె నివాసంలో నాయకులతో కలసి యువతపోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. జగనన్న పిలుపు మేరకు ఈనెల 12వ తేదీ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపేందుకు కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు తరలిరావాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పద్మనాభరెడ్డి(వెదురుకుప్పం), మణి (శ్రీరంగరాజపురం), నాగరాజిరెడ్డి ఎంపీపీ(వెదురుకుప్పం) చందురాజు పాల్గొన్నారు.

పెనుమూరు(కార్వేటినగరం): యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కమలాకర్‌రెడ్డి, అమీన్, దూదిమోహన్, కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీపతి, హరికృష్ణ, మనోహర్, దాము, ఉమాపతి, జమున, మణి, కిరణ్, కేశవులురెడ్డితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.


యువత పోరు పోస్టర్ల ఆవిష్కరణలో కుమారస్వామిరెడ్డి, పార్టీ నేతలు


యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృపాలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి